**న్యూజెర్సీ కథల పోటీలో రూ. 1,000/-ల బహుమతి పొందిన కథ**

– టి.వి.పద్మావతి

నాకు పరిచయమైన మగ పురుగుల్లో రాజారావు కాస్తంత ఉన్నతమైనవాడు. అతనికి వచ్చిన 'కష్టం' మరే మగాడికైనా వచ్చి వుంటే ఎగిరి గంతేసేదాన్ని. తిక్క కుదిరిందని సంబరపడి పోయేదాన్ని.

రాజారావును చూచి సముదాయించి రావాలనిపించింది.

వెంటనే నెల్లూరు బయల్దేరాను.

మా ఆడాళ్ళు చాలా విచిత్రమైన వాళ్ళు. ఎవర్ని వొదలాలో, ఎవర్ని వుంచుకోవాలో సరిగా తేల్చుకోలేరు. లేకపోతే రాజారావు భార్య లేచిపోవటమేమిటి?

నేను ఉద్యోగంలో చేరిన కొత్తల్లో నన్ను ఆకర్షించిన వాడు రాజారావు ఒక్కడే. అంతకు ముందు యూనివర్సిటీలో, ఇళ్ళ దగ్గర పరిచయమైన మగపురుగులకు చాలా వరకు భిన్నమైన వాడు రాజారావు.

నేను ఈ మగాళ్ళను ఒక ఆట ఆడించిన దాన్నే. ఉద్యోగంలో చేరిన మొదట్లోనే ఇద్దరు ముగ్గుర్ని 'డింకీ' కొట్టించి నవ్వుకున్నాను. రాజారావుని కూడా ఒక చూపు చూద్దామని అనుకున్నాను. ఎంత దగ్గరకు వెళ్ళినా అవసరం లేకున్నా చేతి వేళ్ళు తగిలించినా పట్టించుకునే వాడు కాదు. నిజం చెప్పొద్దూ! అలా నిర్లక్ష్యం చేస్తున్నందుకు కోపం రావలసింది పోయి, కాస్త ఇష్టం ఏర్పడింది.

చిన్నగా అతన్ని లైన్లోకి దింపబోయి నేనే అతనికి దగ్గరైపోయాను.

ఆడది ధైర్యంచేసి తన ఇష్టాన్ని తెలియజేస్తే అంగీకరించని మగవాడెవడైనా ఈ భూమ్మీద వున్నాడా? రాజారావు కూడా మగాడే కదా!

చూపులు, నవ్వులు దాటి ఎవరూ లేనపుడు 'ముద్దు' పెట్టుకునే దాకా వ్యవహారం నడిపించాను. నేను కూడా ఇష్టంగానే ముద్దులిచ్చాను. మనసు లేకుండా ముద్దులిచ్చేటంత చెడ్డదాన్ని కాదు.

అప్పుడే చాలా విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది.

ఆఫీసు వ్యవహారాల మీద వస్తున్న 'చంద్రకాంత్' అనే కుర్ర కాంట్రాక్టరు నా చూపుల్లో చిక్కుకుని గిలగిల లాడుతున్న విషయం ఆలస్యంగా గ్రహించాను.

'పెళ్ళి చేసుకుందాం' అన్నాడు.

పళ్ళు రాలగొట్టుకోటానికి ఏ రాయి అయితేనేం? కానీ నా మనసు మాత్రం 'కాస్ట్లీ'రాయితోనే కొట్టుకుంటే బావుంటుందనిపించింది.

అదీగాక రాజారావుని చేసుకుంటే ఏం లాభం? చాలీ చాలని జీతాలు, ఆశలు, కోర్కెలు.



పెద్దగా కూడా ఆలోచించలేదు.

చాలా మామూలుగా రాజారావుతో చెప్పాను. నా పెద్ద కళ్ళు అమాయకత్వాన్ని అద్భుతంగా ప్రదర్శిస్తాయని నాకు తెలుసు.

రాజారావు కూడా ఆశ్చర్యం ప్రకటించలేదు. నా అంత మామూలుగానే అంగీకరించాడు.

'నీ జీవితం, నీ ఇష్టం' అన్నాడు హృదయపూర్వకంగా.

తరువాత నా వివాహం చంద్రకాంత్‌తో వైభవంగా జరిగిపోయింది. ఉద్యోగం మాత్రం ఎలాంటి స్థితిలోనూ వదులుకోనని ముందుగానే చెప్పేశాను.

రాజారావు ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని నెల్లూరు వెళ్ళిపోయాడు.

తరువాత పెళ్ళి చేసుకున్నాడని, ఒక బాబు కూడా వుట్టాడని సాటి ఉద్యోగుల ద్వారా తెలిసి మనస్ఫూర్తిగా ఆనందించాను.

అంతా కలలాగా గడిచిపోయినట్లయింది.

ఇంతలో పిడుగులా ఈ వార్త.

జీవితం నేర్పిన ఎన్నో అనుభవాల ద్వారా మనసు మరింత పరిపక్వత చెందింది. ఎప్పుడైనా మల్లెల వేళ, వెన్నెల రాత్రులు రాజారావు తళుక్కున మదిలో కదలాడేవాడు. ఒకసారి వెళ్ళి పలకరించి వద్దామా? అనిపించేది. అంతలోనే మళ్ళీ రొటీన్ లైఫ్‌లో పడి ఆ విషయానికి అంతగా ప్రాధాన్యత ఇచ్చేదాన్ని కాదు. చివరకు ఇలా పలకరించవలసి వస్తుందని వూహించలేదు.

* * * * *

నేను వెళ్ళే సరికి రాజారావు ఆఫీసులోనే వున్నాడు.

చెరగని దరహాసం, నెమ్మది. పలకరింపు అలాగే వున్నాయి.

నన్ను చూసి ఆశ్చర్యంతో సీట్లోంచి లేచి మరీ ఆహ్వానించాడు.

ఆఫీసు వర్క్, స్పాట్ కలెక్షన్లు, ప్రైవేటీకరణ – వీటికి సంబంధించే మాట్లాడుకున్నాం. ఆ మాటలన్నీ అయ్యాక చివరగా అన్నాను.

"కేవలం నిన్ను చూడాలని వచ్చాను"

"చాలా సంతోషం. నాకు తెలుసు ... మనుషుల్ని అంత తొందరగా మర్చిపోవు నువ్వు" అన్నాడు.

"ఇంటికి వెళ్దామా?" సందేహంగానే అడిగాను.

"ఒక్క నిమిషం" అంటూ పర్మిషన్ లెటర్ వ్రాసి ఇచ్చి నన్ను తీసుకుని ఇంటికి బయల్దేరాడు.

దారిలో ఏమీ మాట్లాడలేదు.

రిక్షాలో కూచున్నా నన్ను తాకనైనా లేదు.

మేము రిక్షా దిగేసరికి నాలుగేళ్ళ పిల్లాడు ఎగురుకుంటూ వచ్చి రాజారావుని చుట్టేశాడు. రాజారావు పోలికలతో కళకళలాడుతున్నాడు ఆ బాబు.

"మా బాబు. అఖిల్" అన్నాడు.

"నమస్తే ఆంటీ" అంటూ బుల్లి చేతులు జోడించాడు.

ఎందుకో కళ్ళు చెమ్మగిల్లినై. ఆర్ద్రంగా బాబుని ఎత్తుకుని హృదయానికి హత్తుకున్నాను.

ఇంట్లో కూచొని టీ తీసుకున్నాక, తాపీగా మాటల్లోపడ్డాం.

డైరెక్ట్‌గా రంగంలోకి దిగాను.

"ఇలా ఎందుకు జరిగింది? ఆమెకు ఏమి తక్కువ చేశావు?" అడిగాను సూటిగా.

రాజారావు కాసేపు మాట్లాడలేదు.

చిన్న నవ్వు నవ్వి –

"ఆడవాళ్ళ మనస్తత్వం అర్థంచేసుకునేంత గొప్పవాణ్ణి కాదు పద్మా. జరుగుతున్నది గమనిస్తూ 'ఓహో' అనుకుంటూ వుండటమే" అన్నాడు.

"అయాం సారీ! ఇలాంటి పరిస్థితిలో నిన్ను కలవాల్సి వస్తుందని అనుకోలేదు. నువ్వే ఏదో పొరపాటుచేసి వుండాలి. లేకుంటే ఇంత చక్కని బాబుని, నిన్ను వొదిలి ఎందుకు వెళ్తుంది?" ప్రశ్నించాను.

నా కళ్ళలోకి సూటిగా చూచి –

"చేసి వుంటావా?" అడిగాడు.

"మరి ఇదెలా సాధ్యం?"

"ఆడవాళ్ళకు అసాధ్యాలే వుండవు. అన్నీ సాధ్యాలే"

గోడ మీద వున్న పెళ్ళి ఫోటో వంక ఒకసారి చూసి –

"పద్మా! నా భార్య తెలివైంది కాదు. బాగా చదువుకున్నదీ కాదు. మధ్యతరగతి కుటుంబంలో నుంచి వచ్చింది. నేను నా హృదయమంతటితో ప్రేమించాను. ఆమె కూడా నా అభిమానానికి పులకరించిపోయింది. ఏ బలహీన క్షణాలు ఆమెను ఇలా చేయటానికి ప్రోత్సహించాయో అర్థంకావట్లేదు. నా అంత ఇష్టంగా మరొకరు చూస్తారంటే నేను వొప్పుకోను. ఇలా రాసి వుంది. అంతే" అన్నాడు.

కాసేపు ఏమి మాట్లాడాలో అర్థంకాలేదు. ఇలాంటి స్థితిలో సహజంగానే ఆమెపై కోపం, అసహ్యం కలగడంలో ఆశ్చర్యం లేదు. అతన్ని కాస్త సముదాయించాలని –

"లోకంలో ఎన్నో జరుగుతుంటాయి. మనం ఆశ్చర్యంగా చూస్తుంటాం. మన వరకు వచ్చేసరికి సంభ్రమానికి లోనౌతాము. పెద్దగా ఆలోచించకు రాజారావ్! పోతే పోయింది. ఆపిడ బుద్ధే బైటపడింది. నీ అంత గొప్ప మనసు గల అమ్మాయి దొరక్కపోదు. నువ్వు బాధపడి, పసిపిల్లాణ్ణి కూడా బాధపెట్టకు. జీవితం చాలా విశాలమైంది" అన్నాను.

ఆ మాటలకు పెద్దగానే నవ్వాడు.

"నేను అందుకు బాధపడట్లేదు పద్మా"

"మరి" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆమె నీ అంత తెలివైంది కాదు. నువ్వు నన్ను వొదిలి బాగా డబ్బు వున్న వాణ్ణి పెళ్ళాడావు. అది కూడా అలాగే బాగా డబ్బున్న వ్యక్తితో వెళ్ళిపోయివుంటే అసలు ఆలోచించేవాణ్ణే కాదు. కూటికి కూడా గతిలేని ఒక వెధవతో వెళ్ళిపోయింది. పిచ్చి మొహంది. ఎన్ని ఇబ్బందులు పడుతుందో! ఏమో? తిరిగి రాగలిగితే సంతోషం. ఆ భ్రమ నుంచి బైటపడి నా దగ్గరకు రాలేకపోతే ఆమెను ఎవరు ఆదరిస్తారు? ఎలా బ్రతుకుతుంది. పిచ్చిపిల్ల."

రాజారావు నిజంగానే, స్వచ్ఛంగానే మాట్లాడుతున్నాడు.

నేను చకితనై చూస్తుండి పోయాను.

చాలా రోజుల తర్వాత మనసుకు గట్టి దెబ్బ తగిలింది.

సాయంత్రం వరకు రాజారావుతో మాట్లాడుతూనే వున్నాను. తిరిగి వచ్చేస్తూ మనసులో కదలాడుతున్న ప్రశ్నను మరోసారి గుర్తుతెచ్చుకున్నాను.

ఎవరు పురుగు?

రాజారావా?

నేనా?

రాజారావు భార్యా?

ఈ ప్రశ్నకు నేనుగా సరైన సమాధానం ఈ జన్మకు చెప్పకోలేనేమో!...

## ఫన్నీ ఫన్నీ

"ఇద్దర్ని పెళ్ళిచేసుకుంటే ఏమిటి కష్టం?"
"ఏం లేదు ఇద్దరు అత్తగార్లని భరించాలి!"


*

"వారం రోజుల్లో నీ భార్య చనిపోతుంది" జ్యోతిష్కుడు చెప్పాడు.
"ఆ విషయం నాకు తెలుసు. నేను దొరికిపోతానా?"


*

"వారం రోజుల్నుంచి ఒక్క కేసు లేదు. టీ డబ్బులు కూడా రావడంలేదు" కానిస్టేబుల్ అన్నాడు.
"అలా నిరుత్సాహ పడకు. 'మనిషి' మీద విశ్వాసం పెంచుకో" హెడ్ హితవు చెప్పాడు.

'తెలుగు కళాసమితి' (న్యూజర్సీ), ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, రాజా లక్ష్మి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కథలు, కార్టూన్ల పోటీలో ఒక్కొక్కటికి రూ. 125/–లు బహుమతి పొందిన కార్టూన్లు.




* బి.సుధీర్, బి.39/15, లాబ్ క్వార్టర్స్, హైదరాబాద్ –




జి.రామ్‌మోహన్, 12–15–156 ఎం.కె.నగర్, ఒ.యు.క్యాంపస్, హైదరాబాద్ – 7